9వ పాఠం ఆగష్టు 22-28

# వశము చేసుకొనెడు ఒక తీరును అభివృద్ధి చేసుకొనుట

**సబ్బాతు మధ్యాహ్నము : ఆగష్టు 22**

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : యోహాను 4:27-30, 39-42; మత్తయి 15:21-28; 2థెస్సలో 1:1-4; రోమా 15:7; ఎఫెసి 4:32; 1పేతురు 3:15.**

**కంఠతవచనం: "నిర్మలమైన మనస్సాక్షి కలిగినవారై మీలో ఉన్న నిరీక్షణను గూర్చి మిమ్మును హేతువు అడుగు ప్రతి వానికిని సాత్వికముతోను, భయముతోను సమాధానము చెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండి మీ హృదయములందు క్రీస్తును ప్రభువుగా ప్రతిష్ఠించుడి" (1పేతురు 3:15).**

యేసు ప్రజలను అంగీకరించి వారిని స్థిరపర్చే సామర్థ్యము గలవాడని తెలుసుకొని ఆయనను గూర్చి మనము ఎంత ఎక్కువ చదివితే అంత ఎక్కువ ఆశ్చర్యపోవుదుము. ఆయన దినాలలో ఉన్న మత నాయకులను తీవ్రముగా గద్దించినను, పాపముతో పెనుగులాడుచున్న వారిని అపరాధ భావముతో కృంగిపోవుచున్న వారిని, నిందలతో దండింపబడిన వారిని సంతోషముగా వారిని తన యొద్దకు చేర్చుకునేవాడు. వారి యెడల తన కృపను చూపించేవాడు. నీచమైన పాపులను కూడా దయతో సంరక్షించేవాడు. వారి పాపాలు ఎంత లోతుగా ఉన్నప్పటికి ఆయన చూపించిన క్షమాబుద్ధి అంతకన్నా ఎక్కువ లోతుకు వెళ్ళేది. ఆయన ప్రేమకు అవధులు లేవు.

యేసు ఎన్నడు లేశమంతైన గర్వమునుగాని లేక ఆధిక్యతను గాని ప్రదర్శించలేదు. ప్రతి మానవుడిని దేవుని పోలిక చొప్పున సృజింపబడినవానిగానే చూసేవాడు. అయినప్పటికి అతడు పాపము వలన పతనమైపోయినప్పుడు, అతని రక్షించుటకు ఆయన ఈ లోకములోనికి వచ్చెను. ఆయన ప్రేమకు మించిన వాడెవడును లేడు. ఆయన దృష్టిలో ఆయన కృప చేరలేనంత లోతుకు ఏ మానవుడు పడిపోలేదు. ఎవరితో అనుబంధము ఏర్పడినదో వారందరి యెడల గౌరవ మర్యాదలు కలిగియుండేవాడు. మానవులుగా వారు పొందవలసిన హోదాతో వారిని సత్కరించాడు. ఆయన ప్రజలయందు నమ్మకముంచే వాడు గనుక తన రాజ్యము కొరకు వారిని ప్రభావితము చేసేవాడు. వారినెంతో గాఢముగా ప్రేమించి సంరక్షించేవాడు గనుక ఆయన సమక్షములో వారి జీవితాలు మార్పు చెందేవి. వారు ఎంత వరకు ఉపయోగపడగలరని ఆయన నమ్మాడో వారు అంత అందుకొనగలిగే వారు.

ఈ వారము పాఠమును మనము చదువుకొనుట ద్వారా ప్రజల యెడల యేసు కనుపర్చిన తీరును గురించి ఎక్కువ లోతుగా అధ్యయనము చేయబోవుచున్నాము. ఆయన అనుసరించిన ఆ సూత్రాలను మన జీవితాలలో ఏవిధంగా వినియోగించుకొనగలమో కనుగొనబోవుతున్నాము.

–ఆగష్టు 29 సబ్బాతు దినమున ఈ వారము పాఠమును అధ్యయనము చేయుటకు ఈ వారమంతయు చదువుడి.

**ఆదివారం** **ఆగష్టు 23**

## సువార్తను గ్రహించెడు గుణము కలిగియుండుట

**యోహాను 4:27-30, 39-42 చదువుడి. యేసు సమరయ స్త్రీతో మాట్లాడినప్పుడు ఆమె యొద్ద నుండి వచ్చిన స్పందనను బట్టి అన్ని రకాలైన ప్రజలు ఊహించని స్థలములలో కూడా సువార్తను గ్రహించెడు గుణము కలిగియున్నారనే సత్యమును ఈ దృష్టాంతము ఎట్లు రుజువు చేయుచున్నది?**

-----------------------------------------------

-----------------------------------------------

సమరయ ప్రాంతములో సువార్తను గ్రహించెడు గుణము కలిగిన వారుంటారని యేసు యొక్క శిష్యులు ఆశించియుండకపోవచ్చును. ఆరాధన విషయములోను మరియు విశ్వాస సూత్రముల విషయములోను సమరయ ప్రజలు యూదులతో నిరంతరము ఘర్షణ పడుతూనే ఉన్నారు. ఎన్నో దశాబ్దముల కాలము నుండి ఆ రెండు గుంపులకు చెందిన ప్రజల మధ్య ద్వేషము రగులుకుంటూనే ఉన్నది. సమరయ ప్రజలు అన్యమత సంప్రదాయములు కలిగిన వారి చుట్టు ప్రక్కలున్న ప్రజలను వివాహము చేసికొనుట వలనను వారను సరించుచున్న మతాచారములను సంప్రదాయ బద్ధముగా ఆచరించకపోవుట వలనను యూదులు సమరయులను తిరస్కరించి యెరూషలేములోని దేవాలయ నిర్మాణము విషయములో సమరయులను భాగస్వాములుగా చేయుటకు యూదులు ఒప్పుకొనలేదు. అందుచేత సమరయులు గెరిజీము కొండ మీద వారి సొంత దేవాలయమును నిర్మించుకున్నారు. సువార్తను ప్రకటించుటకు అది అనువైన ప్రాంతము కాదని శిష్యులు భావించి వారు ఉద్దేశపూర్వకముగానే సమరయ ప్రాంతమును దాటుకొని వేరే ప్రాంతానికి వెళ్ళిపోయేవారు.

శిష్యులు చూడనటువంటి విషయాన్ని యేసు చూచాడు. అక్కడ సువార్తనుగ్రహించెడు హృదయములను యేసు చూచెను. బావి యొద్ద స్త్రీతో జరిగిన సంభాషణను యోహాను వివరిస్తూ ఈ మాటలు వ్రాసాడు. ఆయన యూదయ దేశము విడిచి గలిలయ దేశమునకు తిరిగి వెళ్ళెను. అయితే "ఆయన సమరయ మార్గమున వెళ్ళవలసి వచ్చెను" (యోహాను 4:3,4) ఎవరూ ఊహించని ప్రదేశములో సువార్తను అంగీకరించే హృదయాలు ఉన్నవని పరిశుద్ధాత్మ ప్రేరేపణ వలన నమ్మకము ఏర్పడి సమరయలో నుండి వెళ్ళవలసిన అవసరమును యేసు గుర్తించాడు. పరిశుద్ధాత్మ ద్వారా మన నేత్రములు దైవ సంబంధమైన అభిషేకము పొందినప్పుడు ఇతరులు ఎక్కడైతే విషయ పరిస్థితులను చూస్తారో అక్కడే మనము అనుకూలమైన విషయాలు సాధ్యమవుతాయని కనుగొంటాము. ఇతరులు ఎండిన భూములను చూస్తే మనము ఒక విలువైన ఆత్మల పంటను కోయుటకు సిద్ధముగా ఉన్న పొలములను చూడగలుగుదుము.

**అపొ॥కార్య 8:4,5,14 చదువుడి. సమరయలో యేసు చేసిన సువార్త పరిచర్య ద్వారా కలిగిన అంతిమ ఫలితము ఏమిటి?**

-----------------------------------------------

-----------------------------------------------

దేవుని వాక్యములోని సత్యమును సమరయులు కనీసము వినుటకు కూడా అవకాశము ఇవ్వకుండా శిష్యులు ఆ ప్రాంతమును దాటి వెళ్ళియుండెడివారు. వారేమి చూడలేకపోయారో యేసు చూడగలిగాడు. ఒక స్త్రీ యొక్క హృదయములో సువార్తనుగ్రహించే గుణమును పరిశుద్ధాత్మ సృష్టించి యున్నట్లు యేసు గుర్తించాడు. ఆమె ఆకస్మికముగా తన హృదయాన్ని ప్రభువునకు సమర్పించికొని మారుమనసు పొందుట వలన ఆ పట్టణములో వందలమంది ప్రజలు రక్షణ సువార్త యెడల ఆకర్షింపబడ్డారు.

**ఇతరుల మీద మన మాటలు, క్రియలు ఎటువంటి ప్రభావము చూపిస్తాయో మనకు తెలియకపోవచ్చును. ఆ ప్రభావము మంచికైనను లేక చెడుకైనను నడిపించవచ్చు. అందుచేత ఇతరుల సమక్షములో మాట్లాడేటప్పుడు ఏమి మాట్లాడుచున్నామో ఎందుకు జాగ్రత్త వహించవలసియున్నాము?**

**సోమవారం** **ఆగష్టు 24**

## ఒక సర్దుబాటు వైఖరి

ఇతరులను ప్రభావితం చేయుటకు మనము అవలంబించే వైఖరులు మనకున్న సామర్థ్యాన్ని నిర్ణయిస్తాయి. దురుసుగాను, విమర్శనాత్మకముగాను, విరోధముగా వ్యవహరించే వైఖరి మనకున్న యెడల అది ప్రజలను నీ నుండి దూరము చేస్తుంది. నీవు సువార్త పరిచర్యలో భాగముగా సాక్ష్యమిచ్చినను, నీ మాటలు నిజమైనప్పటికి వాటిని అంగీకరించేవారు ఎక్కువగా ఉండరు.

దానికి విభిన్నమైన ఒక అనుకూల వైఖరిని కలిగియున్న యెడల ఇతరుల యెడల నమ్మకమున్నట్లయితే వారు మన యొద్దకు ఆకర్షింపబడుదురు. స్నేహ బాంధవ్యమును అది సృష్టిస్తుంది. ఈ చక్కటి సూత్రమును యేసు ఎంతో అందంగా వివరించాడు. "దాసుడు తన యజమానుడు చేయు దానిని ఎరుగడు గనుక ఇక మిమ్మును దాసులని పిలువక స్నేహితులని పిలుచుచున్నాడు. ఎందువలననగా నేను నా తండ్రి వలన వినిన సంగతులన్నిటిని మీకు తెలియజేసితిని" (యోహాను 15:15). వారిలో పొరపాట్లున్నను స్నేహితులు ఒకరినొకరు అంగీకరిస్తారు. ఎంతో స్వేచ్ఛగా వారి ఆనందములను, విచారములను పంచుకుంటారు.

**మత్తయి 15:21-28. మరియు మార్కు 14:6-9 చదువుడి. ఈ వాక్యములు వేర్వేరు పరిస్థితులలో ఉన్న ఇద్దరు స్త్రీలను గురించి వివరించుచున్నవి. ఒకరితో యేసు చాలా కఠినముగా వ్యవహరించినట్లు వేరొకరితో చాలా మృదువుగా మాట్లాడినట్లు యేసు**

**కనిపిస్తున్నాడు. వారిరువురి వైపు యేసు తన యొక్క రక్షించగలిగే కృపతో చేరుకున్నట్లు ఈ వాక్యములు ఎటువంటి సమాచారమునిస్తున్నవి?**

---------------------------------------------

---------------------------------------------

మత్తయి 15లో కనిపిస్తున్న స్త్రీ కనానీయురాలు. మొదట ఆమె యొక్క విన్నపమును ఉద్దేశపూర్వకముగానే యేసు తిరస్కరించాడు. అయితే ఆమె తన విన్నపమును వినిపిస్తూనే ఉన్నది. అట్లా చేయుట ద్వారా ఆమె విశ్వాసము వృద్ధి చెందింది. చివరికి ఆమె యొక్క కోరిక నెరవేరుస్తాడు. ఒక పేద కనాను స్త్రీని ఉద్దేశించి యూదయలో ఏ మతనాయకుడు ఆ కాలములో చెప్పలేని విషయాన్ని చెప్పాడు. "అందుకు యేసు అమ్మా నీ విశ్వాసము గొప్పది" (మత్తయి 15:28) అని అన్నాడు. ఏ మతనాయకుడు ఇవ్వలేనట్టి గొప్ప ప్రోత్సాహమును ఆయనిచ్చాడు. ఆమె హృదయము ఎంతగా ఉప్పొంగి పోయి ఉండెనో మరియు ఆమె జీవితము ఎంతగా మార్పు చెందెనో మనము ఊహించుకొనగలమా?

యేసు యొక్క పాదాలను ఖరీదైన అత్తరుతో అభిషేకించిన స్త్రీ ఒక యూదురాలు. అయితే ఆమెకు సమాజములో చెడ్డ పేరున్నది. ఎన్నో విషయాలలో ఆమె తరచూ అపజయము పొందుతూ పాపము చేయుచునే ఉన్నది. అట్టి స్త్రీ ఇపుడు క్షమింపబడి మార్పు చెందినదై నూతన పర్చబడెను. ఇతరులు ఆమెను తీవ్రముగా విమర్శిస్తుంటే యేసు ఆమెను ప్రోత్సహిస్తూ ఆమె చేసిన కార్యమును అంగీకరించెను. ఆ స్త్రీని గూర్చి యేసు ఈ విధముగా ప్రకటించెను. "సర్వలోకములో ఎక్కడ ఈ సువార్త ప్రకటింపబడునో అక్కడ ఈమె చేసినదియు జ్ఞాపకార్థముగా ప్రకటింపబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (మార్కు 14:9).

**మనము చదువుకొనిన ఈ రెండు వృత్తాంతాలను దృష్టిలో పెట్టుకొని చూచినచో అనుకూలమైన విజయమును సాధించే వైఖరిలో ఉన్న ప్రాముఖ్యమైన లక్షణాలేమిటి? కేవలం సాక్ష్యమిచ్చుటకు మాత్రమే కాకుండా సామాన్యముగా జీవితమంతటికి ఎట్టి సర్దుబాటు వైఖరి కలిగియుండాలి?**

**మంగళవారం** **ఆగష్టు 25**

## ప్రేమతో సత్యమును ప్రకటించుట

కేవలం స్నేహముతోనే ప్రజలను క్రీస్తు కొరకు వశపరచుకొనలేము. మనకు అనేక మంది స్నేహితులుండి యుండవచ్చును. వారితో సహవాసము చేయుచు ఆనందిస్తూ ఉండవచ్చును. మనతో సమయము గడుపుటకు వారికి కూడా ఇష్టముగానే ఉండొచ్చు. అయితే మన దృష్టిలో యేసు అంటే ఎవరో వారికి ఎన్నడూ మనము బోధించకపోతే మరియు ఆయన మన జీవితాలను ఏవిధముగా మార్చియున్నాడో అనే విషయాన్ని వారికి వివరించకపోయినచో వారి జీవితాలలో శాశ్వతమైన మార్పును మన స్నేహము ఏమాత్రము తీసుకొని రాలేదు. మనము వారితో గడుపుట వారికి ఆనందముగానే ఉండొచ్చు. వారితో కేవలం ఆనందముగా గడుపుటే కాక దేవుడు మనలను ఇంకా విలువైనది

చేయవలసియున్నామని ఆయన పిలుచుచున్నాడు. స్నేహ భావముతో మెలగుట వలన ప్రజలను క్రీస్తు యొద్దకు నడిపించలేము మరియు అదే సమయములో మన పొరుగు వారితోను, ఇతర ప్రజలతోను స్నేహ రహితులుగా లేక విరోధముగా ఉన్న యెడల, అటువంటి వైఖరి వలన వారు క్రీస్తు నుండి దూరమైపోయే ప్రమాదము ఉంటుంది.

అపొస్తలుడైన పౌలు ఈ సందర్భముగా మనతో మాట్లాడుతూ "ప్రేమ కలిగి సత్యమును చెప్పుము" (ఎఫెసి 4:15) అని హెచ్చరించెను. సాధ్యమైనంతవరకు మనము మన స్నేహితులను అంగీకరిస్తున్నామని వారికి చూపించగలిగినప్పుడు తగిన సమయమందు వారిని మనము ప్రశంసించినపుడు వారితో కొన్ని విషయాలలో ఏకీభవించినప్పుడు స్నేహ బాంధవ్యాలు నిర్మింపబడును. ఇతరులను మనము సమీక్షించేటప్పుడు వారిలో ఉన్న చెడు కన్నా మంచిని మనము కనుగొనుటకు ప్రయత్నించడమనే అలవాటును పెంచుకున్నట్లయితే ఎంత శ్రేయస్కరము.

**2థెస్సలో 1:1-4 చదువుడి. థెస్సలోనీకీయులతో పౌలు కనుగొనిన కొన్ని మంచి విషయాలను ఒక పట్టికగా వ్రాయండి.**

---------------------------------------------

---------------------------------------------

కొందరు వారిని గూర్చి వారు అన్ని విషయాలలో ఇతరులకన్నా మంచిగానే ఉన్నామనే భావనలో ఇతరులలో తప్పులను వెదకుటయందు ఆనందిస్తూ ఉంటారు. అపొస్తలుడైన పౌలు ఈ అభిప్రాయమునకు వ్యతిరేకముగా చూచాడు. ఆయన ఏ సంఘాలలో సువార్త పరిచర్య చేసాడో అక్కడ ఆ సంఘాలలో ఉన్న అనుకూల పరిస్థితులను వెదికే వాడు. అవసరమైన చోట తప్పును తప్పనిసరిగా ఖండించే వాడు. అయితే ఆయన దృష్టి ఎక్కువగా ఆయన స్థాపించిన సంఘములను బలమైనవిగా నిర్మించుటకు ప్రయాసపడుతూ ఉండేవాడు. ఈ విషయములో ఆయన వారు అనుసరించుచున్న సత్యమును ఎత్తిచూపిస్తూ దానియందు వారు బలపడునట్లు వారిని ప్రోత్సహించేవాడు.

అనుకూలమైన బాంధవ్యాల యొక్క ప్రాధాన్యతను గూర్చి ఎలెన్ జి వైట్ ఈ విధముగా వ్రాసారు "దేవుని యెదుట మనము అణకువగల స్వభావమును కలిగి యుండి దయతోను, మర్యాదగాను, సమర్పణా హృదయము కలవారమై, కనికరముతో ప్రవర్తించినట్లయితే ఎక్కడ ఒకటి రెండు ఆత్మలను రక్షిస్తున్నామో అక్కడే ఒక వందమంది సత్యమును అంగీకరించి మారుమనస్సు పొందుదురు" -సంఘమునకు సాక్ష్యములు, సంపుటి 9, పుట 189.

**పైన చూపించిన వ్యాఖ్యానముపై కొంతసేపు ధ్యానించండి. మీ సంఘ సభ్యుల యొక్క ప్రతి హృదయమునుండి దయ, మర్యాద, సున్నితమైన ప్రేమ మరియు కరుణ వంటి సుగుణాలు ఉప్పొంగుచున్న యెడల దాని ఫలితమేమై యుంటుంది? అటువంటి గుణాలు కలిగిన సంఘము బాహ్యముగా ఏవిధంగా కనిపిస్తుంది? నీ అంతట నీవే నీ హృదయాన్ని పరిశీలించుకొని ఏవిషయాలలో నీలో అభివృద్ధి అవసరమో తెలుసుకోండి.**

బుధవారం ఆగష్టు 26

## అంగీకారము యొక్క పునాది

**రోమా 15:7 మరియు ఎఫెసి 4:32 చదువుడి. అంగీకారము యొక్క పునాదిని గూర్చి నీవెట్లు వివరించెదవు? అంగీకార వైఖరి సారాంశమేమిటి?**

-------------------------------------------

-------------------------------------------

ఈ రెండు వాక్యాలలో మనము ఒకరిని ఒకరు అంగీకరించుకొనే విషయములో దాగియున్న సూత్రమును అపొస్తలుడైన పౌలు వివరిస్తున్నాడు. క్రీస్తు మనలను క్షమించి, మనలో ప్రతి వారిని ఆయన అంగీకరించాడు కాబట్టి మనము ఇతరులను క్షమించకుండా, వారిని అంగీకరించకుండా ఉండగలిగే అవకాశము ఉన్నదా? వాస్తవముగా మాట్లాడుకున్నట్లయితే యేసు మనలను స్వీకరించాడు కాబట్టి ఇతరులతో కొన్ని పొరపాట్లు ఉన్నను ఒకరికొకరము అంగీకరించుకొనవచ్చును.

దీనిని గురించి మరికొంత లోతుగా అర్థము చేసుకొనుటకు ప్రయత్నించండి. నిన్ను గూర్చి నీవు ఒక్కసారి ఆలోచించుకో. నీవు చేసిన కొన్ని క్రియలను జ్ఞాపకము చేసుకో. ఒకవేళ ఇప్పటికి కొన్ని సమస్యలతో వేదన పడుతున్నావేమో. నీ మట్టుకు నీకే ఆ విషయాలు తెలిసి ఉంటాయి. ఒకవేళ ఆ విషయాలు ఇతరులకు తెలిసిన యెడల భయముతో ఆందోళన చెందుదువేమో ఆలోచించుకో.

అయితే ఏమిటి? విశ్వాసము ద్వారా క్రీస్తునందు నీవు అంగీకరింపబడి యున్నావు. నిన్ను గూర్చి ఇతరులకు తెలియని అన్ని విషయాలు ఆయనకు తెలిసే యున్నవి. అవును నిన్ను గూర్చి ఆయన సమస్తమును ఎరిగినవాడు. అయినప్పటికి నీలో మంచితనమున్నదని కాదు గాని ఆయన తనంతట తాను నిన్ను అంగీకరించియున్నాడు.

ఈ సందర్భములో ఇతరుల యెడల నీ వైఖరి ఎట్లుండాలి? ఈ విషయమును అర్థము చేసుకొనుట కొందరికి కష్టముగా ఉండవచ్చును. అయితే యదార్థముగా ఇతరులను అంగీకరించడమంటే వారు ఏవిధంగా ఉన్నారో ఆవిధంగా వారిని అంగీకరించుట అని అర్థము. వారు దేవుని స్వరూపమందు మానవులుగా సృజింపబడినవారు కాబట్టి వారికున్న పాపపు అలవాట్లతోనే వారిని అంగీకరించవలసియున్నది. ఎందువలనంటే క్రీస్తు మన కొరకు చనిపోయాడు. "ఏలయనగా మనమింకా బలహీనులమై యుండగా (పాపులమైయుండగా) క్రీస్తు మన కొరకు చనిపోయెను. ఆయన మనలను దేవునితో సమాధానపరచియున్నాడు. మనము ఆయనకు విరోధులముగా ఉన్నపుడే ఆయన మనలను అంగీకరించెను. అందుచేత మనము ఇతరులను క్షమించి అంగీకరించవచ్చును. ఇతరులను అంగీకరించుటకు, క్షమించే గుణము కలిగియుండుటకు మన యెడల ఆయనకున్న ప్రేమ పునాదియైయున్నది" (రోమా 5:6-10).

అయితే ఒకసారి ఇతరులను అంగీకరించాలనే అంగీకారానికి వచ్చిన తరువాత సంరక్షించాలనే సంబంధము నెలకొల్పబడుతుంది. లేఖనములలో ఉన్న సత్యములను

అనుసరించేటప్పుడు ఇతరులతో మనము ప్రేమతో వ్యవహరించవలసిన అవసరము ఎంతైనా ఉన్నది. ఆవిధముగా అంగీకరించలేకపోయిన యెడల ప్రేమను నిర్లక్ష్యము చేసినట్లవుతుంది. స్నేహితులుగా మనము జీవితమును మార్చివేయగల శాశ్వత సత్యములను ఒకరితో ఒకరు పంచుకొనవలసి యున్నది.

"నీవేమైనా చేయి. నాకు ఎటువంటి అభ్యంతరములేదు. అప్పటికి నిన్ను నేను అంగీకరిస్తాను" అనేది యేసు యొక్క వైఖరి కాదు. "నీవేమి చేసావో దానిని క్షమించి నిన్ను అంగీకరిస్తాను. మరియు ఈ జీవితమును మార్చి వేయగల శక్తిని నీకు ఇస్తాను" అనే రీతిలో ఆయన వైఖరి వ్యక్తపరుస్తున్నాడు. క్రీస్తు యొక్క మనస్సును పోలిన ప్రేమ వైఖరి వినయముగా అలవర్చుకొని బైబిలు సత్యములను బోధించిన యెడల హృదయములను జయించుటయే గాక, జీవితాలు కూడా మార్పు చెందుతాము.

**ఒక వ్యక్తి యొక్క పాపపు ప్రవర్తనను అంగీకరించకుండా ఆ వ్యక్తిని అంగీకరించుట ఎట్లు సాధ్యమవుతుంది. మనము పాపమును ఖండించకుండా లేక పాపమును సహిస్తూ ఇతరులను ఏవిధముగా అంగీకరించగలము?**

గురువారం ఆగష్టు 27

## ప్రేమ పూర్వకముగా సత్యమును బోధించుట

ప్రేమ కోసము సత్యమును బోధించుటలో యేసు నిర్లక్ష్యము చేయలేదు. ఎందుచేతనంటే అది ప్రేమ అనబడదు. ప్రేమ అనునది ఇతరులకు మేలును కోరేదైయుంటుంది. ప్రేమకును మరియు సత్యమునకును మధ్య ఎటువంటి పోరాటము వుండదు. వినయముతోను మరియు దయగల మాటలతో బోధించిన సత్యము, ప్రేమ ప్రకటన వాక్యముగా ఉంటుంది. "నేనే మార్గమును, సత్యమును, జీవమును, నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడు" (యోహాను 14:6). యేసే రక్షణకు ఏకైక మార్గము (అపొ॥కా॥ 4:12). ఆయన జీవితమును మనము జీవించుటకును, ఆయన సత్యమును మనము ఎరుగుటకును, ఆయన కృప మనలను రక్షించెను. ప్రేమలేని సత్యము ఊపిరాడకుండా చేసే న్యాయపోరాటము వంటిది. అది ఆధ్యాత్మిక జీవితమును ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. అదే సమయములో సత్యము లేని ప్రేమ గాలికి కొట్టుకొనిపోయే పడవలాగ సారము లేని భావము వలె ఉంటుంది. ప్రేమ పూర్వకముగా సత్యమును బోధించినపుడు అది విశ్వసనీయమైన క్రైస్తవ అనుభవములోనికి నడిపించి జీవితమునకు ఒక గురిని నిర్దేశిస్తుంది.

**1పేతురు 3:15; 2తిమోతి 4:2 మరియు తీతు 3:4,5 చదువుడి. బైబిలు సత్యమును బోధించుటకును వినయముతో అంగీకరించే ఆత్మను కలిగియుండుటకు సూచించే ఏ మాటలను ఈ వాక్యములు అందిస్తున్నాయి?**

---------------------------------------------

---------------------------------------------

సత్యము కన్నా ప్రేమ మిన్న అనే భావమును నూతన నిబంధన గ్రంథకర్తలు ఎప్పుడు వ్యక్తపర్చలేదు. ఆ రెండింటిని అనగా ప్రేమను మరియు సత్యమును అదేవిధముగా కృపను మరియు ధర్మశాస్త్రమును దయను మరియు నమ్మకమును ఎంతో మనోహరముగా వీటిని జత చేసి చూపించారు. తోటి విశ్వాసులకు పేతురు సలహా ఇస్తూ "నిర్మలమైన మనస్సాక్షి కలిగినవారై మీలో ఉన్న నిరీక్షణను గూర్చి మిమ్మును హేతువు అడుగు ప్రతి వానికిని సాత్వికముతోను, భయముతోను సమాధానము చెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండుడి" (1పేతురు 3:15). ఇంకొక మాటలో చెప్పాలంటే నీవు దేనిని నమ్ముచున్నావో దాని విషయమై నీవు తెలిసికొని యుండవలెను. నీవు దానిని ఎందుకు నమ్ముచున్నావు. నీవు ఏమి నమ్ముచున్నావో ఎందుకు నమ్ముచున్నావో వివరించవలసియున్నావు. అంతమాత్రాన నీ యొద్ద అన్ని జవాబులు ఉన్నవని అర్థము కాదు. లేక నీ నమ్మకములను బట్టి ఇతరులను ఒప్పించే సామర్థ్యము నీ వద్ద ఉన్నదని దాని అర్థము కాదు. అయితే ఆ అంశములో ఉన్న గొప్పతనమును బట్టి వినయముగా నీ యొక్క విశ్వాసమును గూర్చి సాత్వికముతోను, భయముతోను "సమాధానము చెప్పుటకును సంసిద్ధుడవై యున్నావని దాని అర్థమైయున్నది".

తన సంరక్షణలో ఉన్న తిమోతికి పౌలు వ్రాస్తూ "వాక్యమును ప్రకటించు సమయమందును అసమయమందును ప్రయాసపడుము. సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము, గద్దించుము, బుద్ధి చెప్పుము (2తిమోతి 4:2). ఆయనే తీతుకు గుర్తు చేస్తూ "తన కనికరము చొప్పునను మరియు దేవుని ప్రేమ వలనను పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారా మనలను రక్షించెను" అని చెప్పెను (తీతు 3:5).

మనము కూడా సాత్వికముతోను భయముతోను ప్రేమ పూర్వకముగా సత్యమును బోధించవలసియున్నాము. ఆయనతో జత కలిపి ప్రేమతో సత్యమును బోధించ వలసియున్నాము. ఆయనతో జత కలిపి ప్రేమతో అంగీకరించే వైఖరి గలవారమై క్రీస్తు లేకుండా మరణించుచున్న ఈ లోకమునకు కడవరి కాల వర్తమానమును ప్రకటించుటకు పిలువబడితిమి.

**మీరు ఎందుకు క్రైస్తవుడయ్యారు? అని మిమ్ములను ఎవరైనా అడిగితే ఏవిధముగా ప్రతిస్పందిస్తారు. ఎందువలన?**

**శుక్రవారం** **ఆగస్టు 28**

## అదనపు అధ్యయనము

"క్రీస్తులో దయ కలిగిన ఒక గొఱ్ఱెల కాపరి ఉన్నాడు. ప్రేమ కలిగిన అమ్మ నాన్న వున్నాడు. అవధులు లేని కృప కలిగిన దయామయుడైన రక్షకుడున్నాడు. ఆయన తన దీవెనలను తన ఆకర్షించుకొనే గుణముతో వెదజల్లుచున్నాడు. తానివ్వదలచిన దీవెనలను కేవలము ప్రకటించుట కొరకే పరిమితమవ్వలేదు ఆయన. వాటిని పొందాలనే తీవ్రమైన ఆశను కలిగించిన తరువాత ఆయన వాటిని గూర్చి మాట్లాడెను. మహిమ మరియు ఘనత కలిగిన ఆ వరమును తన దాసులైన వారు లోకమునకు అందించవలసిన వారై యున్నారు.

ఆశ్చర్యకరమైన యేసు యొక్క ప్రేమ, హృదయములను కరిగించి వాటిని లోబరుచుకొనును. కేవలము సిద్ధాంతములను గూర్చి తరుచుగా బోధించుట వలన ఏమియు సాధించలేరు".

"మీ దేవుడు సెలవిచ్చిన మాట ఏదనగా, సియోనూ, సువార్త ప్రకటించుచున్నదానా ఉన్నత పర్వతము ఎక్కుము. యెరూషలేమూ, సువార్త ప్రకటించుచున్నదానా బలముగా ప్రకటించుము. భయపడక ప్రకటింపుము. ఇదిగో మీ దేవుడు అని యూదా పట్టణములకు ప్రకటించుము. ఇదిగో తన బాహువే తన పక్షమున ఏలుచుండగా ప్రభువగు యెహోవా తానే శక్తి సంపన్నుడై వచ్చును. ఆయన ఇచ్చు బహుమానము ఆయన యొద్దనున్నది. ఆయన చేయు ప్రతీకారము ఆయన ముందుగా నడుచుచున్నది. గొఱ్ఱెల కాపరి వలె ఆయన తన మందను మేపును. తన బాహువుతో గొఱ్ఱెపిల్లలను కూర్చి రొమ్మున ఆనించుకొని మోయును. పాలిచ్చు వాటిని ఆయన మెల్లగా నడిపించును. (యెషయా 40:1, 9-11) ఎలెన్ జి వైట్ యుగయుగాల ఆకాంక్ష, పుటలు 826, 827.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. అది మంచి లక్షణము కాకపోయినప్పటికి, కొంతమంది ప్రజలు ఇతరుల యొక్క తప్పిదములను ఎత్తి చూపిస్తారు. అటువంటి స్వభావము మనలో లేకుండా ఉండుటకు ఏమి చేయవలసి యున్నాము?

2. **ఈ దృశ్యమును పరిశీలించండి :** ఒక స్నేహితుడు ఒక భూస్థాపన కార్యక్రమమునకు హాజరై వచ్చి "మా ఆంటి, పరలోకమునకు వెళ్ళి, క్రిందనున్న నావైపు చూస్తున్నందుకు నేను ఆనందించుచున్నాను. ఆ విషయమై నేను ఎంతో మంచి అనుభూతిని పొందుచున్నాను" అని చెప్పెను. ఈ వారము మన పాఠము చదివిన విషయాలను ఆధారము చేసుకొని పై విషయానికి నీవు ఏవిధముగా స్పందిస్తావు? మరణించిన వాని యొక్క స్థితి అనే అంశము ఎంత ప్రాముఖ్యమైనదైనా, ఆ వ్యక్తితో ఈ అంశము మీద అప్పుడు చర్చించడము సరియైన సమయమేనా?

3. "ఇతరులకు మనము ఇచ్చే సాక్ష్యమును బట్టి ఈ క్రింది భావమును గూర్చి చర్చించండి. ఇతరులలో పాపమును వెదకు వారిలో పాపము అభివృద్ధి చెందును. ఇతరుల పొరపాట్లను గురించి ఆలోచించు వారు అదే కూపములోనికి వారు మార్చబడుదురు. అయితే నా యేసును చూచుట ద్వారా మనము ధ్యానించినప్పుడు ఆయన స్వరూపములోనికి మార్పు చెందుదుము. ఆయన మన ముందుంచిన శ్రేష్టమైన, ఆదర్శవంతమైన లక్ష్యమును గూర్చి ధ్యానించినపుడు మనము పవిత్రమైన, పరిశుద్ధమైన వాతావరణములోనికి అనగా దేవుని సన్నిధికి మన దృష్టి ఎత్తబడుతుంది. ఇక్కడ మనము ఆయనయందు నిలిచియున్న యెడల మన ద్వారా మనతో సంబంధమున్న వారందరికి ఆయన వెలుగు ప్రకాశిస్తుంది" ఎలెన్ జి వైట్, సువార్త పనివారు పుట 479.

❖❖❖